# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం 19 అక్టోబర్ 2025


## కడప అమీన్ పీర్ దర్గా ఉర్సుకు సీఎంకు అహ్వానం

**రాజంపేట,అక్టోబర్18 ప్రభాతవార్త**


సీఎం చంద్రబాబుకు ఆహ్వానాన్ని అందజేస్తున్న పీఠాధిపతి

కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు మహోత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దర్గా కమిటీ ఆహ్వానించింది. ఈ మేరకు సీఎం చంద్రబాబును కడప అమీన్ పీర్ దర్గా పిఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ అరిఫుల్లా హుస్సేనీ కలిసి ఆహ్వానం అందించారు. జాతీయ స్థాయిలో పేరొందిన ఈ ఉర్సు మహోత్సవాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్నాయని ఈ ఉర్సు మహోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రిని కోరారు. ఉర్సు మహోత్సవ ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతున్నాయని సీఎంని అడిగి తెలుసుకున్నారు. ఉర్సు మహోత్సవాలకు సహకారం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమీన్ పీర్ దర్గా మేనేజర్ మొహమ్మద్ అలీ ఖాన్, బాఖీ ఉల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

## అండర్ 19 బాల బాలికల బాస్కెట్ బాల్ జట్లు ఎంపిక

**మదనపల్లి, అక్టోబర్ 18 ప్రభాత వార్త**

ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ 19 బాల బాలికల బాస్కెట్బాల్ హాకీ హ్యాండ్ బాల్ నెట్ బాల్ జట్ల ఎంపిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిటిఎం నందు శనివారం జరిగాయి ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటాయి. ఎంపిక కార్యక్రమానికి అండర్ 19 జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజా, సెలక్షన్ కమిటీ సభ్యులు రెడ్డి శ్రీనివాస్, నరేష్, నాగరాజా, ఆసిఫ్, శివ, రెడ్డి ప్రసాద్, రియాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉమాదేవి, ఉష, హరి, వేణు, యూసఫ్ లు పాల్గొన్నారు.



# వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి






**దువ్వూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

మైదుకూరు నియోజకవర్గం దువ్వూరులో స్వచ్ఛ ఆంధ్రస్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛందర స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలన్నారు. బయట చెత్తను మండించడం వంటి పనులు మరియు వాయి కాలుష్యాన్ని కలిగించే పనులను తగ్గించుకోవాలని సూచించారు. సైకిల్ మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా మన చుట్టుపక్కల వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజలందరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఒక చెట్టు ఒక జీవితం అనే నినాదంతో పచ్చదనం, పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు, విద్యార్థులకు ఆయన వివరించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మరియు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ లుదువ్వూరు ఎంపీడీఓ ఆఫీస్ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించి ఎంపీడీఓ ఆఫీస్ నుండి దువ్వూరు పట్టణం మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి, మానవహారంగా ఏర్పడి ప్రజలతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారుఈ కార్యక్రమంలో డిపిఓ రాజ్యలక్ష్మి, మండల అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకే టపాసులు అమ్మాలి

సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



**మదనపల్లె అక్టోబర్ 18 ప్రభాతవార్త**

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మదనపల్లి పట్టణం మిషన్ కాంపౌండ్,టిప్పు సుల్తాన్ మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి,స్థానిక తహసిల్దార్ కిషోర్ కుమార్ రెడ్డితో కలిసి పర్యవేక్షించారు.టపాసుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అమ్మకాలు జరపాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.టపాసాలు దుకాణ యజమానులు తీసుకోవాల్సి న జాగ్రత్తలను పోలీసులు ఫైర్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.మదనపల్లి డివిజన్ ప్రజలకు ముందుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగ సందర్భంగా పిల్లలు టపాసులు పేల్చే సమయంలో పెద్దలు పర్యవేక్షించాలని జాగ్రత్తలు తెలియజేశారు. ప్రభుత్వ అనుమతులు పొందిన లైసెన్స్ ఉన్న టపాసుల అంగళ్లు వద్దనే టపాసులు కొనుగోలు చేయాలని కోరారు.మదనపల్లి డివిజనులో 86 దుకాణాలు ఏర్పాటు చేశారని ఇందులో పాతవి 74 దుకాణాలతో పాటు కొత్తగా 12 మందికి అనుమతులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల,ఫైర్ ఆఫీసర్ శివప్ప,వన్ టౌన్ ఎస్.ఐ శివకుమార్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయస్థానాల కోసం ప్రత్యామ్నాయ భవనాలు పరిశీలించిన జిల్లా జడ్జి


న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి


న్యాయస్థానాల కోసం ప్రత్యామ్నాయ భవనాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**పీలేరు అక్టోబర్ 18 ప్రభాతవార్త;**

పీలేరులో న్యాయస్థానాల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక పరిశీలించారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న న్యాయస్థానాల పాత భవనాలు మరమ్మతులకు గురికావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శనివారం స్థానిక కోర్టును సందర్శించి వాటి స్థితిగతులను క్షుణ్ణంగా చూశారు. ఆ భవనాలకు మరమ్మతులు చేపట్టడం జరిగితే న్యాయస్థానాల నిర్వహణ కోసం తాత్కాలికంగా అవసరమైన ప్రభుత్వ భవనాల కోసం ఆరా తీశారు. అందులో భాగంగా పట్టణ శివారులో పీలేరు మదనపల్లి మార్గంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఖాళీగా ఉన్న భవనాలను, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు 11వ ఆదనపు జిల్లా జడ్జి ఏ. మహేష్, జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బీసీ పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, న్యాయవాదులు చంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఎల్లా రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, భవాని శంకర, నిరంజన్ కుమార్, రవీంద్రారెడ్డి, ఇతర న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది, రోడ్లు భవనాల శాఖ డిఈ సురేష్ నాయక్, ఎంపీడీవో శివశంకర్, సబ్ జైల్ సూపరింటెండెంట్ కె. చంద్రశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దారు, అర్బన్ సీఐ యుగంధర్, పట్టణ ఎస్ఐ, పంచాయితీ కార్యదర్శి, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మదనపల్లి మార్గంలోని న్యాయమూర్తుల నివాస గృహాలను తనిఖీ చేసిన ప్రధాన జిల్లా జడ్జి శ్రీమతి అరుణ సారిక. న్యాయమూర్తుల నివాస గృహాలను కూడా తనిఖీ చేసి, వాటి స్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### ఆర్.ఎం.పి వైద్యం ప్రైవేటు ల్యాబ్‌లపై

# పర్యవేక్షణ ఎక్కడ ?

మనుషుల ప్రాణాలు పోతే కాని ప్రభుత్వ అధికారులు స్పందించరా...??

**మైదుకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**


ఇటీవల సీజ్ చేసిన ప్రైవేట్ ల్యాబ్

కడప జిల్లా మైదుకూరు పట్టణంలో ప్రైవేటు వైద్యంతో ఆర్ఎంపి క్లినిక్‌లు, ప్రవేట్ ల్యాబులు ప్రభుత్వ అనుమతులు సర్టిఫికెట్స్ లేకుండా మున్సిపాలిటీ పరిధిలో చాలానే ఉన్నాయి. ఆర్ఎంపి క్లినిక్‌లో మనుషుల ప్రాణాలను వైద్యం పేరుతో విచ్చలవిడిగా అనుభవం లేని వైద్యం చేస్తూ పూర్తిగా అనుభవం లేని వైద్యంతో అధికంగా ఇంజక్షన్లు, ఇతర వైద్యం చేయడంతో మనుషుల ప్రాణాలు చాలా మంది చనిపోవడం జరిగిన మధ్యవర్తంతో డబ్బులు చెల్లించి బయటికి రాకుండా ఆర్ఎంపి క్లినిక్ నడుపుతున్న వైద్యులే పంచాయతీలు చేయడం దాచడం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో వీటికి అధికారం డబ్బులు అడ్డం పెట్టుకొని బయటపడుతున్నారు. ఇప్పటికైనా ఇలాంటి సంఘటనలు జరగకుండా జిల్లా అధికారులు మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో లైసెన్సులు లేకుండా ఇతరుల పేరుతో నడుపుతున్న క్లినిక్‌లపై పర్యవేక్షణతోపాటు కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజల ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తుంది. చర్యలు చేపట్టాల్సిన వైద్యాధికారులు చూసి చూడనట్లు ఉండడంవల్ల ఇలాంటివి జరుగుతున్నాయని ప్రజలు అనుకుంటున్నారు. కఠిన చర్యలు అధికారులు చేపడితే ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని, ప్రభుత్వ హాస్పిటల్స్ పై వైద్య విధానాలను పట్టణ గ్రామాలలో అవగాహన కల్పిస్తే ఆర్ఎంపీ క్లినిక్‌లకు వెళ్లకుండా కొంతైనా చైతన్యం తీసుకురావచ్చని స్థానికులు వేడుకుంటున్నారు.

**అనుభవం లేని ల్యాబ్‌ల్లో అధికంగా వసూలు,**

అనుభవం లేని రక్త పరీక్ష ల్యాబ్‌లు చాలా ఉన్నాయి. వీటిపై పర్యవేక్షణ లేకపోవడంతో వైద్యం కోసం వెళ్లే ప్రజల దగ్గర అధికంగా వస్తువులు చేయడంతో పాటు పూర్తిగా రోగికి సరైన సమాచారము కూడా అందించలేని వైద్యులు ఉన్నారు. కమిషన్ల కోసం కొంతమంది డాక్టర్లు, ఆర్ఎంపి క్లినిక్ వైద్యులు ల్యాబ్‌లకు పంపిస్తే వైద్యానికి వచ్చిన ప్రజల దగ్గర విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తూ చలామణి అవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ల్యాబ్ సెంటర్లను అనుభవము, ప్రభుత్వ సర్టిఫికెట్స్ చేసిన వ్యక్తులే నడిపేలా చర్యలు చేపట్టి ప్రతి ల్యాబ్ సెంటర్లో రక్త పరీక్షలు చేసే వాటికి పట్టిక రూపంలో ఫీజులు ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు. వైద్యం పూర్తిస్థాయిలో గ్రామస్థాయి నుండి ప్రభుత్వ వైద్య ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు చేపట్టాలని అంతేకాకుండా మం డలాల్లో నకిలీ క్లినిక్‌లపై చర్యలు తీసుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

### ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు

# విస్తృత ఏర్పాట్లు చేయండి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వచ్చే నెల నవంబర్ 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలు



**కడప, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

నవంబర్ 4 నుండి 10 వ తేదీ వరకు జరుగనున్న "అమీన్ పీర్ దర్గా" ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్ నందు అమీన్ పీర్ దర్గా ఉత్సవాల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై.. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు జేసీ అదితి సింగ్ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, తదితర అధికారులు, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్త ప్రాముఖ్యం కలిగిన అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను కడప నగర ఫెస్టివల్‌గా మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా స్టాండర్డ్ నిబంధనలను పాటిస్తూ ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.15 రోజుల ముందుగానే ముందస్తు ప్రణాళికతో అన్నిరకాల ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం, అన్ని శాఖల అధికారులు, దర్గా మేనేజ్మెంట్, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

## పీలేరు సబ్ జైలు ఆకస్మిక తనిఖీ

**పీలేరు అక్టోబర్ 18 ప్రభాతవార్త:**



పీలేరు సబ్ జైల్లో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పీలేరు సబ్ జైలును చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం పీలేరు న్యాయస్థానాల సందర్శన కోసం వచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సబ్ జైలును సందర్శించి అక్కడి ఖైదీలతో న్యాయ విజ్ఞాపన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సబ్ జైలులోని ఖైదీలకు తగిన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సదుపాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు, ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మరియు 11వ అదనపు జిల్లా జడ్జి ఏ. మహేష్, చిత్తూరు జిల్లా సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, సబ్ జైలు సూపరింటెండెంట్ కె. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ మద్యం కేసులో

# 9 మంది నిందితుల పోలీస్ కస్టడీ పూర్తి

రెండు రోజుల పాటు పోలీస్ విచారణ

**మదనపల్లి, అక్టోబర్ 18 (ప్రభాతవార్త)**



నకిలీ మద్యం తయారీ కేసులో అరెస్టయిన నిందితుల్లో తొమ్మిది మంది పోలీస్ కస్టడీ ముగియడంతో వారిని శనివారం సబ్ జైలుకు తరలించారు. ఎక్సైజ్ పోలీసులు పది మంది నిందితులను శుక్రవారం కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడైన కట్టా సురేంద్ర నాయుడుకు మాత్రం మరోరోజు కస్టడీ కొనసాగనుంది. దీంతో ఆయనను ఎక్సైజ్ కార్యాలయంలోనే విచారిస్తున్నారు. కస్టడీ పూర్తయిన మిగిలిన తొమ్మిది మంది నిందితులను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం జైలుకు పంపారు. నిందితులు విచారణలో తాము కేవలం కూలీలమేనని, మిగిలిన విషయాలు ఏమీ తెలియవని చెప్పినట్లు సమాచారం. రెండు రోజుల పాటు జరిగిన ఈ విచారణను ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, సిట్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ విచారణలో ఎక్సైజ్ ఈఎస్ మధుసూదన్, అసిస్టెంట్ ఈఎస్ జోగేంద్రలు పాల్గొన్నారు. మద్యం తయారీ కేంద్రంలో లభించిన డైరీ, సెల్ఫోన్ కాల్ డేటా, నకిలీ మద్యం కొనుగోలు, విక్రయదారుల వివరాల ఆధారంగా పోలీసులు నిందితులను విచారించినట్లు తెలుస్తోంది. కాగా, విచారణలో నిందితులకు సంబంధించి ఎలాంటి సమాచారాన్ని ఎక్సైజ్ పోలీసులు పత్రికా విలేకరులకు వెల్లడించలేదు.

## పీలేరులో 37.6 మిల్లీమీటర్ల వర్షపాతం

**పీలేరు అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

పీలేరులో 37.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు ఏఎస్వో రెడ్డెప్పనాయుడు తెలిపారు. శనివారం పీలేరులో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వర్షపు నీటితో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమైంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా బస్టాండ్ ప్రాంగణం వర్షపునీటిలో మనిగిపోవడం సరామామూలైపోతోంది. అలాగే ఎల్బీఎన్ రోడ్డు మొత్తం వర్షపునీటితో నిండిపోయింది. దీంతో ప్రయాణీకులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


జలమయమైన పీలేరు ఆర్టీసీ బస్టాండ్

### వక్ఫ్ ఆధీనంలోనే

# ఉత్సవ టెండర్ నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ కీ మైనారిటీ నేతలు వినతిపత్రం

**వేంపల్లె:అక్టోబర్ 18(ప్రభాత వార్త)**

ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జరిగే కడప అమీన్ పీర్(పెద్దదర్గా)దర్గా ఉత్సవాల టెండర్ ని వక్ఫ్ బోర్డు ఆధీనంలోనే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ని మైనారిటీ నేతలు విన్నవించారు. శనివారం కడపలోని జిల్లా కలెక్టరేట్ లో మైనారిటీ రైట్స్ ఫోరం అధ్యక్షుడు దస్తగిరి, అధికార ప్రతినిధి డా.ఇబ్రహీం జిల్లా కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కడప నగరంలోని అమీన్ పీర్ దర్గా వక్ఫ్ బోర్డుకు చెందిందని, దర్గా కు సంబంధించి ఏ ఉత్సవమైన వక్ఫ్ బోర్డు అనుమతితో నిర్వహించాలన్నారు. అయితే ఇప్పటి వరకు ఇస్టానుసారంగా ఉరుసు ఉత్సవాలు జరిగాయని, దీంతో వక్ఫ్ బోర్డు ఆదాయానికి గండి పడిందన్నారు. దర్గాకు సంబంధించి ఏపి హైకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ విషయాన్ని రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు సమాచారాన్ని తెలిపామన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ని కలిసి దర్గాకు సంబంధించిన ఏ ఉత్సవమైన వక్ఫ్ బోర్డు అనుమతితో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అలాగే ఉత్సవ టెండర్ లు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో బహిరంగంగా జరగాలని కోరారు. వక్ఫ్ బోర్డుకు ఆదాయంతో పాటు పేద ముస్లిం సమాజానికి ఆసరాగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ వెల్ఫేర్ అధికారి హిదాయతుల్లా, వక్ఫ్ బోర్డు అధికారి వసీం అక్రమ్, మైనార్టీ నాయకులు మునీర్, ఖలీమ్, అబ్దుల్, అన్వర్, చాంద్ బాషా, ఇలియాస్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలు నీళ్లొదిలిన టపాసుల దుకాణాలు

### మూడింతల ధరలతో కొనుగోలు దారుల నడ్డి విరుస్తున్న వైనం

**గాలివీడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

దీపావళి పండుగ వస్తోందనగానే.. దోపిడీకి తెరలేపుతారు అక్రమార్కులు. ఈ ఏడాది కూడా అదే దిశగా కుయుక్తులు పన్నుతున్నారు. టపాసుల విక్రయాల మాటున కోట్లాది రూపాయలు వెనకేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. పండుగ సందర్భంగా లక్షలాది రూపాయల విలువ చేసే టపాసుల విక్రయాలు సాగుతాయి. తమిళనాడులోని శివకాశి తదితర ప్రాంతాల నుంచి టపాసులను తక్కువ ధరకు తీసుకొచ్చే వ్యాపారులు ప్రజలకు మాత్రం మూడింతలు అధిక ధరలకు అమ్ముతూ వారి జేబులకు చిల్లు పెడుతున్నారు. పన్నుల శాఖ ద్వారా ప్రభుత్వాలకు అందాల్సిన ఆదాయం విషయంలో లక్షల రూపాయలకు గండి పడుతోంది. పన్ను ఎగ్గొట్టేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. రెగ్యులర్ లైసెన్స కలిగిన డీలర్లు పాతికశాతం మాత్రమే పన్ను చెల్లించి,మిగిలిన మొత్తానికి టోకరా వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరికొందరు లైసెన్స్ లు రెన్యూవల్ చేసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. వాస్తవానికి టపాసుల విక్రయదారులు పన్నుల శాఖకు 18 శాతం చెల్లించాలి. దుకాణం లైసెన్స్, టిన్ నెంబరు ఉన్న స్లిప్పు మీద ఇన్వాయిస్ బిల్లులు కాకుండా కేవలం తెల్ల కాగితం మీద బిల్లులు రాసి పంపుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. గాలివీడు మండలంలో 4 టపాసుల గోడౌన్లు ఉన్నాయి. వీరు సరఫరా చేసే బాణాసంచా విలువ రూ.100 ఉంటే వాటిపై రూ.500 కు పైగా,రూ.200 ఉంటే రూ.1000 కిపైగా ధర ముద్రించి ఉంటుంది. వీరు షాపులకు వచ్చే వ్యక్తులను బట్టి టపాసుల ధరలు నిర్ణయించి, అమ్మకాలు చేస్తూ ప్రజల జేబులను ఖాళీ చేస్తున్నారు. ఏటా లక్షల్లో వ్యాపారం సాగుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. దీపావళి సందర్భంగా మూడు రోజుల్లోనే కోటి రూపాయలు వరకు అమ్మకాలు సాగుతాయి. పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలు, వేడుకల సమయంలో రూ.లక్షల్లో టపాసులు విక్రయిస్తుంటారు. పన్ను చెల్లించకుండా వ్యాపారం నిర్వహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు.

**పన్ను టోకరాకు సిద్ధం....**

ఏటా టపాసుల వ్యాపారం విషయంలో అక్రమార్కులు పన్నుల శాఖకు టోకరా వేస్తూనే ఉన్నారు. మండలంలో టపాసుల విక్రయానికి సంబంధించి ఎంత మందికి రెగ్యులర్ లైసెన్స ఉంది? అనేది ప్రశ్నార్థకమే?ఎక్కడపడితే అక్కడ గోదాముల్లో దాచి, అమ్ముతున్నా పట్టించుకునేవారు లేరు.వీరి నుంచి పన్నుల శాఖకు 25 శాతం మాత్రమే జీఎస్టీ అందుతోందని తెలిసింది. పెద్ద సంస్థ నుంచి తెచ్చిన టపాసుల్లో 80 శాతం బిల్లులు లేకుండానే మాయ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు....**

భాగ్యలత, తాసీల్దార్, గాలివీడు. బాణసంచా దుకాణదారులు నిబంధనల మేరకే నడుచుకోవాలి. నివాసాల మధ్య జనవాసాల ప్రాంతంలో దుకాణాలు నడుపకూడదు. అధిక ధరలకు విక్రయించిన, టపాసుల దుకాణాల్లో మైనర్ల ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.



## పెన్నా నదిలో వ్యక్తి గల్లంతు

**సిద్ధవటం అక్టోబర్18 ప్రభాతవార్త**

పెన్నా నదిలో వ్యక్తి గల్లంతు కావడంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ దొరకలేదు సిద్ధవటం మండలంలోని వంతాటిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పొట్టి గాళ్ళ నంద అనే వ్యక్తి శనివారం మధ్యాహ్నం గ్రామంలోని పెన్నా నదికి తన పెంపుడు కుక్కను తీసుకొని వస్తూ ఉండగా పెన్నా నీటిలో చేపలు ఎగరడంతో చేపల కోసం వెళ్ళిన కుక్కను మందలించబోయి ప్రమాదవ శాత్తు పెన్నా గల్లంతయ్యాడు అతని ఆచూకీ కోసం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ళు సాయంత్రం 5, గం, నుండి రాత్రి7 వరకు గాలింపు చేపట్టిన ఆచూకీ లభించలేదు ఈ సందర్భంగా సిఐ బాబు మాట్లాడుతూ పెన్నా నదిలో గల్లంతైన వ్యక్తి కోసం కడప ఫైర్ రిస్కీ టీం గజ ఈతగాలతో గాలింపు చేపట్టిన ఆచూకీ దొరకలేదని ఆదివారం ఉదయం గాలింపు చేపడతామన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ అసిస్టెంట్ ఎస్ ఐ సుబ్బరామచంద్ర హెడ్ కానిస్టేబుల్ కొండయ్య వీఆర్వో ప్రభాకర్ రెడ్డి, స్థానిక పోలీసులు, శివ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి

**కె.వి.పల్లి, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

మండలంలోని నూతన కాల్వ పంచాయతీ, మద్ది పట్ల వాండ్లపల్లి, తూపల్లె గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణ పై కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 24 మధ్య వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన కొత్త ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నం మానుకోవాలని కోరారు. మెడికల్ కాలేజీలను పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే నడపాలి ఉన్నారు, ప్రజానీధులతో నిర్మించిన భవనాలు ఆసుపత్రులు పూర్తిగా ప్రభుత్వాధినంలోనే కొనసాగాలి అన్నారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం కావాలన్నారు. ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందని ద్రాక్షలా అవుతుందన్నారు.పేద మధ్యతరగతి ప్రజలకు ఉచిత సూపర్ స్పెషాలిటీ సేవలు దూరం అవుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కోచ్ అవినాష్ రెడ్డికి ఘన సన్మానం

**పీలేరు అక్టోబర్ 18 ప్రభాతవార్త;**



కోచ్ అవినాష్ రెడ్డిని సన్మానించిన సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయ అనుబంధ కళాశాలల క్రీడల్లో సత్తా చాటిన సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కోచ్ గా వ్యవహరించిన అవినాష్ రెడ్డిని సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య ఘనంగా సత్కరించారు. శనివారం కళాశాల ఆవరణంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇచ్చి యూనివర్సిటీ రాష్ట్ర, దేశీయ క్రీడా పోటీల్లో మెళకువలు నేర్పి వారి విజయానికి కృషి చేసిన అవినాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ పోటీల్లో పాల్గొని గెలిచిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు విద్యార్థులు ఆదిసగా అడుగులు వేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి.



**మైదుకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**

ఎస్టీయు సర్వసభ్య సమావేశం ఈనెల 22తేదీన మైదుకూరు ఎంఆర్సి లో జరుగుతుందని రీజియన్ కన్వీనర్ కె.వెంకటేశ్వర రాజు అధ్యక్షతన సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ టి యు రాష్ట్ర కౌన్సిలర్ కూశెట్టి పాలకొండయ్య మాట్లాడుతూ బోధనేతర పనులు ఉపాధ్యాయులకు తీసివేయాలి,4 డిఏలు విడుదల చేయాలని, పిఆర్సి కమిటీ వేయాలని,ఐ ఆర్ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి యాపరాల వెంకట సుబ్బయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మల్లేశ్వర రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు బి. కె సురేష్ ఎస్టియు నాయకులు చంద్రశేఖర్, రమణయ్య, ఈశ్వరయ్య, నాగేంద్ర, రమేష్, విజయ్,కిరణ్,నారాయణ ప్రసాద్, నాగరాజు, సురేంద్ర నాయక్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమతిలేని లేకుండా చేస్తే చర్యలు

**పోరుమామిళ్ల రూరల్, అక్టోబర్ 18 ప్రభాతవార్త:**



ప్రభుత్వ అనుమతి లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శనివారం ఒక ప్రకటనలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. టపాసులు అధికారిక లైసెన్స్ కలిగిన తయారీదారుల నుంచి మాత్రమే కొనుగోలు చేసి విక్రయించాలన్నారు. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా అధికారుల సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. టపాసులు రోడ్లపై, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో కాల్చకూడదని సూచించారు.

## సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సదస్సు

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :**

స్థానిక వైఎంఆర్ కాలనీలోని లేపాక్షి డిగ్రీ కళాశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన టౌన్ డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్, జీఎస్టీ ఆఫీసర్ వడ్డె హనుమంతరావు ప్రసంగిస్తూ జీఎస్టీ వలన విద్య, ఆరోగ్యం, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువుల సేవల విషయంగ కలిగే లాభాలను వివరించారు. జీఎస్టీ చారిత్రక నేపథ్యాన్ని కూడా ఆయన విద్యార్థులకు సవిరంగా తెలిపారు. ప్రిన్సిపాల్ ఆర్. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ ఫలితాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన తెలిపారు. ఎన్ఎస్ఎస్ పిఓఐ ఆర్. నాగభూషణ శర్మ ఆర్థిక సంస్కరణలు, జీఎస్టీ ఆవిర్భావం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు సుధారాణి, అధ్యాపకురాలు విద్యార్థులు పాల్గొన్నారు.



## మంచినీటి సమస్య పరిష్కారం

**కలికిరి, అక్టోబరు 18, ప్రభాతవార్త:**



పీలేరు ఎమ్మెల్యే నల్లారి ఆదేశాలతో మహల్ లో మంచినీటి సమస్య పరిష్కారం అయింది. ఆసుపత్రిలో ఉద్యోగులు, సిబ్బంది, రోగులు మంచి నీటికి ఇబ్బందులు పడేవారు. దీన్ని మహల్ తెదేపా నాయకుడు సుబ్బయ్య ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే పంచాయతీ అధికారులను ఆదేశించారు. పంచాయతీ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో తెదేపా నాయకులు సుబ్బయ్య ఎర్రదొడ్డిపల్లె రక్షిత మంచినీటి బోరు నఉుంచి ఆసపత్రి వరకు పైపులైను ఏర్పాటు చేసి ఆసుపత్రి ట్యాంకుకు మంచినీటిని సరఫరా చేయడం జరిగింది. దీంతో సమస్య పరిష్కారం అయింది. ఆసుపత్రి డాక్టర్లు, రోగులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## జీతాల కోసం కార్మికులు ఎదురుచూపు

**కలికిరి, అక్టోబరు 18, ప్రభాతవార్త:**



కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న సిబ్బందికి గత 4 నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు అందజేయకపోవడంతో కార్మికులు వారి కుటుంబ పోషణకు పలు ఇబ్బందులు పడుతున్నారు. చాలీ చాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టమై నానా అవస్థలు పడుతున్నారు. ప్రతి నెల జీతం అందించాల్సిన కాంట్రాక్టరు 4 నెలలు అయినా జీతాలు అందించిన దాఖలాలు లేవని జీతాలు మంజూరు చేయాలని కాంట్రాక్టరుకు ఫోన్ చేసినా స్పందించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా సమస్యను పట్టించుకునే వారు లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టరు స్పందించి తమకు జీతాలు అందేలా కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

## ఇలాగైతే రీ సర్వే ఎలా... రీ సర్వేపై రైతుల అసంతృప్తి

**కలికిరి, అక్టోబరు 18, ప్రభాతవార్త:**

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో జరుగుతున్న రీ సర్వేపై రైతులకు సమాచారం అందక రీ సర్వే చేసుకునేందుకు రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రీ సర్వే మొదట్లో అధికారులు రీ సర్వే చేసే ముందు రైతులకు నోటీసుల ద్వారా సమాచారం ఇచ్చేవారు. దాంతో రైతులు తమ భూములకు సంబంధించిన పత్రాలను రీ సర్వే చేసే అధికారులకు చూపించి సర్వే చేయించుకున్నారు. ఈ రీ సర్వే కలికిరి మండలం డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణారెడ్డి, కలికిరి మండల సర్వేయర్ రెడ్డప్ప పర్యవేక్షణలో జరుగుతోంది. కానీ 2 రోజులుగా రీ సర్వేకి సంబంధించి వాట్సాప్ గ్రూప్‌లో నంబర్లు పెడుతున్నారు. దీంతో రైతులకు సమాచారం తెలియక తమ భూముల వద్దకు అధికారులు ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తున్నారు. కావున వాట్సాప్ నందు కాకుండా నోటీసులు ద్వారా సమాచారం తెలపాలని కోరుకుంటున్నారు.

## ఉపాధి వేతనాలు ఎటు వెళ్తున్నాయి..

**జమ్మలమడుగు, అక్టోబరు 18, ప్రభాతవార్త:**



ఉపాధి వేతనాలు ఎటు వెళ్తున్నాయని అర్హులకా.. అనర్హులకా.. అని సీపీఎం పట్టణ కార్యదర్శి గోపాల్ దాస్ ఏసు దాస్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ పెద్దముడియం, మైలవరం, జమ్మలమడుగు తదితర మండలాల్లో నిరుపేదలైన ఉపాధి కూలీలుగా ఉన్న వారు కష్టపడి ఉపాధి పనులు చేసుకుంటూ రోజుకు రూ.310 వస్తుంది. అయితే ఉపాధి పనులు చేయని దాదాపు 90 కుటుంబాల వారికి వారి ఖాతాలో రూ.1,94,583 జమ అయ్యాయని ఇది ఎవరు తింటున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై సోమవారం ఆర్డీవోకు పూర్తి ఆధారాలతో సీపీఎం ఆధ్వర్యంలో అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు వినయ్‌కుమార్, కార్యకర్తలు నూర్‌బాషా, దస్తగిరి, గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత ధరలకే విక్రయించాలి

**జమ్మలమడుగు, అక్టోబరు 18, ప్రభాతవార్త:**

రాబోయే దీపావళి పండగ సందర్భంగా పట్టణంలో టపాసుల దుకాణాల యజమానులు అధిక ధరలకు విక్రయించకుండా నిబంధనల మేరకు విక్రయించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి లింగమయ్య డిమాండ్ చేశారు. అలాగే నాసిరకం టపాసులు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నకిలీ మద్యాన్ని అరికట్టాలి

**వేంపల్లె అక్టోబర్ 18:(ప్రభాత వార్త)**



రాష్ట్ర ప్రభుత్వం నకిలీ మద్యాన్ని అరికట్టాలని పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓ వైపు ప్రభుత్వం నాణ్యమైన మద్యం ఇస్తున్నామని, చెక్ చేసుకోండి అని యాప్ ని ప్రవేశపెట్టినప్పటికీ మరోవైపు వేంపల్లెలోని ఒక మద్యం షాప్‌లో నకిలీ మద్యం జోరుగా విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. యాప్ నందు మద్యం చెక్ చేసుకుంటే మరో బ్రాండ్ మద్యం చూపిస్తున్నట్లు మండిపడ్డారు. యాప్ లో మాన్సన్ హౌస్ మద్యాన్ని చెక్ చేసుకుంటే ఓల్డ్ అడ్మిరల్ బ్రాండ్ మద్యం చూపిస్తుందన్నారు. నకిలీ మద్యం విక్రయిస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## దేశ సేవలో సైనికుల పాత్ర ఎనలేనిది



**వేంపల్లె అక్టోబర్ 18:(ప్రభాత వార్త)**

దేశ సేవలో సైనికుల పాత్ర ఎనలేనిదని, ఎంతో గొప్పదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. శనివారం జనసేన నేత హరీష్ తో కలిసి ముతుకూరు గ్రామానికి చెందిన జవాన్ చాపాటి నవీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రక్షణలో పని చేస్తూ నవీన్ మృతి చెందారన్నారు. అత్యంత పేద కుటుంబంలో పుట్టి దేశ సేవలో అమరుడైన నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా చేస్తామని, కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. జమ్ముకాశ్మీర్‌లోని బారాముల్లా ప్రాంతంలో జవాన్ నవీన్ ఆకస్మిక మృతి చెందారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామచంద్రారెడ్డి, దొంతుసుమన్, మల్లికార్జున, జనసేన నాయకులు శ్యామ్, దేవా, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

**రాజంపేట,అక్టోబర్18 ప్రభాతవార్త**

రాజంపేట హరాయచోటి రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న కొనిరెడ్డి మహేంద్ర రెడ్డి అనే విద్యార్థి దుర్మరణం చెందాడు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల కోవెలకుంట్ల కు చెందిన మహేందర్ రెడ్డి మరో మిత్రుడు నరసింహాతో కలిసి మోటార్ బైక్ పై నరసింహులు తో కలిసి రాయచోటి రోడ్ లోని నగరవనానికి వెళ్ళాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా పాల కేంద్రం వద్ద ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కనే ఉన్న ఇనుపహోర్డింగ్ ను వేగంగా ఢీకొనడంతో మహేంద్ర అక్కడికక్కడే దుర్మరణం చెందాడు .నరసింహులుకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజంపేట అర్బన్ పోలీసులునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## "సేనతో సేనాని" ఆశయాల కోసం కలిసి పని చేద్దాం

**వేంపల్లి అక్టోబర్ 18:(ప్రభాత వార్త)**



రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ సీనియర్ నేత ఛలో పీఠాపురం సమన్వయ కర్త డా దాసరి రవిశం కర్ అన్నారు. శనివారం వేంపల్లి పట్టణంలోని తన కార్యాలయంలో రవిశంకర్ మాట్లాడారు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా అందరం కలిసి పనిచేద్దామన్నారు. రాజకీయ వ్యవస్థలో నవతరం, యువతరాన్ని భాగస్వామ్యం చేసేందుకు "సేనతో సేనాని,మన నేల కోసం కలిసి నడుద్దాం" అనే విన్నూత్న కార్యక్రమాన్ని తమ జనసేనపార్టీ నిర్వహించబోతోందని ఆయన తెలిపారు. ఇందులో ఔత్సాహిక యువతీ యువకులు తమకు నచ్చిన అంశా న్ని ఎంచుకొని సేవలందించే అవకా శాన్ని ఈ వేదిక కల్పిస్తుందని ఉపముఖ్యమంత్రి,తమ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించడాన్ని రవిశంకర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేందుకు క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి చేరాలని పవన్ కళ్యాణ్ చెప్పిన విషయాన్ని రవిశంకర్ పేర్కొన్నారు. ఇందులో పులివెందుల నియోజకవర్గ యువతీ యువకులు జనసైనికులు, కార్యకర్తలు, వీర మహిళలు,ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవిశంకర్ సూచించారు.

## ప్రతి పంచాయతీ ఆర్థిక ప్రగతి సాధించాలి



**చిట్వేలి, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**

స్థానికంగా లభించే వనరులతో ప్రతి పంచాయతీ ఆర్థిక స్వాలంబన సాధించడానికి కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. జిల్లా అధికారుల సూచన మేరకు రెండు రోజులు పాటు నిర్వహించిన వార్షిక ప్రణాళిక శిక్షణా తరగతులను శనివారం ముగించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీని బలోపేతం చేసే దిశగా కార్యదర్శులు, సిబ్బంది ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యనికి పెద్ద పీట వేయ్యాలన్నారు. కార్యక్రమంలో ఏవో పద్మభూషణ్ రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రిటైర్డ్ సివిల్ సర్జన్ డాక్టర్ రామ సుబ్బారెడ్డి మృతి

**ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 18 ప్రభాతవార్త**



రాయలసీమలోని వివిధ ప్రాంతాల్లో సివిల్ సర్జన్ గా పనిచేసి రిటైర్డ్ అయిన డాక్టర్ బొల్లవరం రామసుబ్బారెడ్డి(88) శనివారం అనారోగ్యంతో ప్రొద్దుటూరు పట్టణంలో మృతి చెందారు. ఈయన స్వగ్రామం పెద్దముడియం మండలం కొత్తపల్లి గ్రామం కాగా ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్నారు. ఆయన ప్రకాశం జిల్లా గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి అనంతపురం జిల్లా ధర్మవరం, కడప జిల్లా పులివెందుల ప్రొద్దుటూరు తదితర పట్టణాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ గా పనిచేశారు. ఆయన రిటైర్డ్ అయిన అనంతరం రాజుపాలెం మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో ప్రతి శనివారం ఉచితంగా రోగులకు వైద్య సేవలు అందించారు. ఆయన పెద్ద కుమారుడు నాగభూషణ రెడ్డి ఇండియన్ ఫారెన్ సర్వీస్లో భారత రాయబారిగా మలేషియాలో పనిచేస్తున్నారు. రెండవ కుమారుడు వేణుగోపాల్ రెడ్డి ఐఏఎస్ మహారాష్ట్రలో అయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్లో అడిషనల్ చీఫ్ సెక్రటరీగా ఉన్నత పదవుల్లో పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల పలువురు డాక్టర్లు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

## కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు

**పులివెందుల,అక్టోబర్ 18 , ప్రభాత వార్త :**

కష్టపడి ప్రతి విద్యార్థి చదువుతే ఏ ఏ విజయాన్ని అయినా సాధించవచ్చునని ,2010 సంవత్సరంలో జేఎన్టీయూ కాలేజ్ మొదటి బ్యాచ్ పూర్తి చేశారని ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని ఇప్పుడు చదివే విద్యార్థులు కూడా వీరిని ఇన్స్పిరేషన్ గా తీసుకొని మంచి పొజిషన్కు రావాలని హెచ్ఓడి మురళి ఆకాంక్షించారు.పులివెందులలోని జేఎన్టీయూ కాలేజీలో నిర్వహించే సర్వజ్ఞ 2కె25 శనివారం చివరి రోజులో భాగంగా వివిధ టెక్నికల్ మరియు వర్క్ షాప్ లో పాల్గొన్నటువంటి విద్యార్థులు వారిలో గెలుపొందిన వారికి, పూర్వ విద్యార్థులైనటువంటి మొదటి బ్యాచ్ విద్యార్థులు పాల్గొని బహుమతులు ప్రధానం చేశారు. మా రోజుల్లో మొబైల్స్ కూడా సరిగా లేవని ఇప్పుడు ఉన్నటువంటి విద్యార్థులకు అన్ని వసతులు సంపూర్ణంగా ఉన్నాయని వాటన్నిటిని ఉపయోగించుకొని ఇంకా మంచి అవకాశాలను అందిపుచ్చుకునే వెసులుబాటు ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపల్ శేషమేశ్వరమ్మ, డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి. డా.. మురళి, కో కన్వీనర్స్ . ఎస్ రాధాకృష్ణ మరియు ,యస్. జెస్సికా సరిత, కోఆర్డినేటర్స్ మహేంద్ర రెడ్డి, ముని లావణ్య చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.



## మూలకు సాహిత్య కళానిధి పురస్కారం

**ఖాజీపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**



వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ఖాజీపేట మండల పరిధిలోని తుడుములదిన్నే వాస్తవ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి సాహిత్య, కళా, ఆధ్యాత్మిక రంగాలకు చేస్తున్న విశేషమైన కృషికి గుర్తింపుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్, హైదరాబాద్ వారు ఖసాహిత్య కళానిధిఖ జాతీయ లెజెండరీ పురస్కారాన్ని ప్రకటించినట్లు సంస్థ అధ్యక్షులు బిక్కి కృష్ణ రచయిత మూల మల్లికార్జున రెడ్డిని ఆహ్వానించారు. ఈ పురస్కారాన్ని మల్లికార్జున రెడ్డి 2025 అక్టోబర్ 19వ తేదీ ఉదయం 10 గంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో అందుకోనున్నారు. కవిగా, రచయితగా, విమర్శకునిగా మల్లికార్జున రెడ్డి ఇప్పటికే 20 పైగా పుస్తకాలు రాశారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా, కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా చేసిన సాంస్కృతిక, సాహిత్య, కళా సేవలు గుర్తింపదగినవి. మల్లికార్జున రెడ్డి బ్రౌన్ గ్రంథాలయం బాధ్యునిగా, సంచాలకునిగా వైయస్సార్ కడప జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యాలకు సంబంధించిన 25 గ్రంథాలకు సంపాదకత్వం వహించి కడప జిల్లా చారిత్రక, సాహిత్య అంశాలను అక్షరబద్ధం చేసి గ్రంథాలుగా వెలుగులోకి తేవడమే కాకుండా మరో 25 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ఆయన రాసిన సాంఘిక నాటికలన్నింటిని యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం రంగస్థల విద్యార్థులు ప్రదర్శించారు. తాను సదస్సులు నిర్వహించడమే కాక అనేక జాతీయ అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని విలువైన పత్ర సమర్పణలు చేశారు. ఆయన రాసిన 150కి పైగా సాహిత్య వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 2023లో మల్లికార్జున రెడ్డి చేస్తున్న సాహిత్య కృషికి తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఖిగిడుగుఖి పురస్కారం, న్యూఢిల్లీ యుజిసి వారు ఆయనకు 10 లక్షల రూపాయలతో కేటాయించిన ప్రాజెక్టు రాయలసీమ నాటకం చారిత్రక అధ్యయనం అనే పరిశోధనకు 2023లో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నంది నాటకోత్సవాల్లో నంది అవార్డు, నాటక రంగానికి చేస్తున్న సేవలకు 2025 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి కందుకూరిఖి విశిష్ట పురస్కారం స్వీకరించారు. నటునిగా ఆయన ప్రతిభకు చదువుల సాహిత్య వేదిక ఖినటభూషణఖి బిరుదుతో సత్కరించింది. ప్రొద్దుటూరు పల్లవి ఆర్ట్స్ వారి ఖికళా రత్నఖి పురస్కారం, ఒంగోలు పీఎం కెఎం ఫైన్ ఆర్ట్స్ వారి ఖిసేవా రత్న పురస్కారంఖి, కవితా విద్యా సాంస్కృతిక సేవా సంస్థ వారి జానుమద్ది విమర్శ పురస్కారం, దోమా వెంకటస్వామి గుప్త సాహిత్య పురస్కారం, హైదరాబాద్ జానపద సాహిత్య పరిషత్ వారి పురస్కారం మొదలైనవి అందుకున్నారు.

## చాపాడులో స్వచ్ఛాంధ్ర పై సైకిల్ ర్యాలీ

**చాపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**



గ్రామంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక హై స్కూల్ నుండి హైవే రోడ్డు వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. అక్కడ రోడ్డు మీద మానవహారం నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. స్వచ్ఛమైన గాలి ఆరోగ్యకరమైన జీవనం పై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐడిసి డైరెక్టర్ పి. వి. సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో ఎ. వీర కిశోర్, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎంపిడిఓ

**ఖాజీపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**



ఖాజీపేట పంచాయితీ నందు శనివారం నాడు "స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర" కార్యక్రమంను ఎంపిడిఓ దివిజా సంపతి ప్రారంభించారు. స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఖాజీపేట గ్రామపంచాయతీ నందు స్వచ్ఛత పరిశుభ్రత గురించి నినాదాలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఓ దివిజా సంపతి స్వయంగా సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొని కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ సిబ్బందిలో, విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా స్వచ్ఛమైన గాలిపై అవగాహన కల్పించి చెట్లను నాటడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో దివిజా సంపతి, ఎంఈఓ, ఉపాధిహామీ ఏపీఓ, వెలుగు ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ 100 శాతం గెలుస్తాం

**పులివెందుల, అక్టోబర్ 18 , ప్రభాత వార్త :**

పులివెందుల ప్రజల అభిమానం, ఆశీస్సులే మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన బలం, బలగం 33 వాటిల్లో పోటీ చేస్తామని 100శాతం గెలుస్తామని వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడూరు చిన్నప్ప, నూరు భాష సంఘ అధ్యక్షులు ఒత్తురు రసూల్, సర్వోత్తమ్ రెడ్డి, నంద్యాల హేమదిరెడ్డి లు అన్నారు. శనివారం వైఎస్ఆర్ సీపీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి పులివెందుల జెడ్పీ ఉప ఎన్నికలో పులివెందుల మండల ప్రజా ఓట్ల తో మీరు గెలిచారని కాణిపాకం వినాయకుడి మీద ప్రమాణం చేసి చెప్పగలవా అని వారు తెదేపా నాయకులను ప్రశ్నించారు. నిజంగా టిడిపి వారు కి ప్రజల్లో బలం ఉంటే ఎందుకు ఇతర నియోజకవర్గాల నుంచి బీటెక్ రవి టీడీపీ వారిని తెచ్చుకొని అప్రజాస్వామికంగా ఎన్నికలు జరుపుకున్నారు, సామాన్య ప్రజలు సైతం నిన్ను ఛీదరించుకొనే స్థాయి కి నువ్వు నీ పార్టీ దిగజారిపోయారు.



# శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ట్రీ ప్లాంటేషన్

**రాయచోటి అక్టోబర్ 18 ప్రభాతవార్త**

రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ –"పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ, చెట్లు నాటడం వలన కలిగే పర్యావరణ ప్రయోజనాలను వివరించారు. పచ్చదనం పెరుగడం, శుద్ధమైన వాయువు లభించడం, కాలుష్య నివారణ, సమయానికి వర్షాలు పడటం, జీవవైవిధ్యం కాపాడబడటం వంటి అంశాలు చెట్ల ద్వారా సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్ తరాల హితార్థం కోసం కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ మాట్లాడుతూ –"చెట్లు నరికితే ఇక్కట్లు, చెట్లు ప్రగతికి మెట్లు" అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానికి జీవం పోసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆక్సిజన్ నిల్వలు పెరగాలంటే మనందరం పచ్చదనం పెంపొందించడంలో భాగస్వాములం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె. రెడ్డయ్య, ఎన్ఎస్ఎస్ మెంబర్ పావని, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కమిటీ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను స్వీకరించి, ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ప్రతిజ్ఞ చేసి, "పచ్చని భూమి – ఆరోగ్యకరమైన భవిష్యత్తు" అనే సందేశాన్ని నినదించారు.




## దీపావళిపై పోస్టర్లు ఆవిష్కరణ

**రాయచోటి, అక్టోబర్ 18: ప్రభాతవార్త**

రాయచోటి కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శనివారం పర్యావరణ అనుకూల దీపావళి పై పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లలు తగినజాగ్రత్తలు పాటించాలన్నారు దీపావళి పండుగ సందర్భంగా ఇష్టమైన వారికి ఇచ్చే కానుకలు పర్యావరణానికి అనుకూలంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామికి విశేష పూజలు





**బద్వేల్ అర్బన్ అక్టోబర్ 18 ప్రభాతవార్త :**

బద్వేల్ పట్టణంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఆలయ పూజారి వీరేశ చార్యులు లో ఆధ్వర్యంలో తెల్లవారుజామునే స్వామివారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన తో పాటు పలు రకాల విశేష పూజలను వైభవంగా నిర్వహించడం జరిగింది. ప్రత్యేక ఉభయ దాతలుగా మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ సతీమణి వసంత లక్ష్మి, దొడ్ల పాల డైరీ అండ్ టీ స్టాల్ యజమాని పాపిశెట్టి వీరాంజనేయులు సతీమణి రాజేశ్వరి పెద్ది మెన్స్ వేర్ పెద్ది సుధాకర్ సతీమణి వసంతలక్ష్మి, చంద్రమోహన్ సతీమణి సుభాషిని, లక్ష్మి నారాయణ రెడ్డి సతీమణి స్వర్ణలత, ఆదినారాయణ సతీమణి సౌజన్య, కొంతాలపల్లి శ్రీనివాసులు సతీమణి వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులకు తెల్లవారుజామున స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి వారికి స్వామి వారి ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు, పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొని కాయ కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు, స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, మేనేజర్ మాడపూరు వెంకటరమణ తో పాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో కుప్పం సుధాకర్, ముచ్చర్ల సుజాత, ప్రవీణ్, వల్లంకొండు ధనలక్ష్మి తోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన అశ్వయుజమాసం పూజా

**గోపవరం. సెప్టెంబర్ 18 ప్రభాతవార్త.**



మండలంలోని వల్లేరవారి పల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు అశ్వయుజమాసం ప్రారంభంతో నాల్గవ చివరి శనివారం సందర్భంగా వైభవంగా అభిషేకం పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది, తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక అలంకరణ స్వామి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు, తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ 22వ తేది నుంచి కార్తీకమాసం ప్రారంభం అవుతుంది, కార్తీక మాసంలో స్వామివారికి విశేష అభిషేకాలు పూజా కార్యక్రమం లు అలాగే కోటి దీపోత్సవ కార్యక్రమంలు ఉంటాయి అని కార్తీక మాసంలో స్వామి వారి అభిషేకం, పూజా కార్యక్రమంలో పాల్గొన్న వారికి యమగండము, వాహన గండ, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, సర్ప దోషాల, రాహు కేతు దోషాలు తొలగి పోతాయి అని అలాగే దాంపత్య సమస్యలు, సంతాన సమస్యలు తొలగిపోయి అనుకున్న పనులు సకాలం లో నెరవేరుతాయి కావున భక్తులందరూ కార్తీక మాసంలో స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి అభిషేకం, పూజ కార్యక్రమం కోటి దీపోత్సవం లో పాల్గొని స్వామి వారి సంపూర్ణ ఆశీర్వచనం స్వామి వారి వస్త్రం స్వీకరించవలసినదిగా స్వామివారు తెలియజేశారు, తదుపరి స్వామి వారిని దర్శించడం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు, అన్నదాన కైంకర్యం నిర్వహించినవారు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# కాలుష్య రహిత దీపావళిని ఆశిద్దాం

**పీలేరు అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

పర్యావరణానికి హానికలగ కుండా బంధువులు స్నేహితులతో కలిసి స్వీట్లు మరియు బహుమతులతో పాత పద్దతిలో సరికొత్త ప్రమీదల మధ్య వెలుగు పండుగను పరిపూర్ణం చేసుకుందామని డిప్యూటీ హెచ్ఐఒ కొండయ్య విద్యార్థులకు హితవుపలికారు. శనివారం తలుపుల జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కాలుష్యరహిత దీపావళిని ఆశిద్దాం! అంశముపై అవగాహన కల్పించారు. తక్కువ పొగ ధ్వని కాలుష్యం కలిగిన టపాసులు ప్రాధాన్యతనిస్తూ తల్లిదండ్రులు పిల్లలకు దగ్గరగా వుండి కొన్ని జాగ్రత్తలు పాటించాలని, పిల్లలు కాటన్ దుస్తులు ధరించాలని, కళ్లద్దాలు ధరించి ,ఎన్ 95 మాస్కులను ధరించాలని, బకెట్స్ తో నీళ్లు దగ్గరగా ఉంచుకోవాలని, కరెంటు పోల్స్ దగ్గర టపాసులు కాల్చరాదని, ఆస్తమా చికిత్స తీసుకునేవారు దగ్గరగా వెళ్లరాదని (లేదా)ఇన్హేలర్ దగ్గర ఉంచుకోవాలని, మరియు పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు (బాంబులు) పేల్చడం వల్ల బాలింతలు, గర్భిణీలు నవజాతి శిష్యులకు వృద్ధులకు గుండె జబ్బులు గల వారికి కలిగే వాయు మరియు శబ్ద కాలుష్యం వీరిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని దయతో గమనించాలని కొండయ్య విజ్ఞప్తి చేశారు, వేడుకలు ముశాక పరిసరాలతో పాటు చేతులు కళ్ళు సబ్బుతో శుభ్రంగా కడుకోవాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ రెడ్డెప్ప ,పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎన్ఎం ఫాము న్నిసా ,నాగవేణి, సిహెచ్ఓ కుముద ,ఆశా కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.


దీపావళి పండుగ జాగ్రత్తల గురించి విద్యార్థులకు తెలియజేస్తున్న దృశ్యం

## నిబంధనలకు విరుద్ధంగా టపాసులు అమ్మితే చర్యలు



**బద్వేల్ అర్బన్ అక్టోబర్ 18 : ప్రభాత వార్త :**

బద్వేల్ పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాసులు వ్యాపారాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ లింగప్ప, ఎస్సై సత్యనారాయణ తెలిపారు, శనివారం సాయంత్రం సిద్ధవటం రోడ్ మరియు పోరుమామిళ్ల బైపాస్ లో పలు టపాసుల దుకాణాల యజమానులతో సిఐ లింగప్ప సమావేశమయ్యారు, అక్కడ నిర్వహిస్తున్న టపాసుల షాపుల షెడ్లను వారు పరిశీలించారు, అనంతరం సీఐ లింగప్ప, ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ టపాసుల వ్యాపారస్తులు షాపుల వద్ద ప్రమాదాలకు తావు లేకుండా సరైన భద్రత ప్రమాణాలు పాటిస్తూ వ్యాపారాలు జరుపుకోవాలన్నారు, ప్రతి టపాసుల విక్రయ షాపుల వద్ద డ్రమ్ములలో నీరు, ఇసుక, అగ్నిమాపక యంత్రాలు, తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు, చిన్నపిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు, పోలీస్ నియమ నిబంధనకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు, వ్యాపారస్తులు సజావుగా ప్రశాంత వాతావరణంలో వ్యాపారాలు నిర్వహించుకోవాలని వారు పలువురికి సూచించారు, ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అన్నదానం



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త**

టిడిపి బీసీ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణంలో గత నాలుగేళ్లగా ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం మైదుకూరు రోడ్డు లోని అన్వర్ హాలు ఎదురుగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజలు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నదానం నిర్వహించడం, ఇందుకోసం ఆయన మంచి నాణ్యత కలిగిన భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన మరింత కాలం పేదలకు సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్ బంగి శివ, బోడే ప్రసాద్, యేసునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు దీపావళి వేడుకలు

**వేంపల్లె అక్టోబర్ 18:(ప్రభాత వార్త)**

స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. శనివారం ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి దీపాన్ని వెలిగించి వేడుకలను శ్రీకారం చుట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో వివిధ వేషధారణలతో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పాటలు, నాటికలు, నృత్యాలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సంతరించుకుంది. అలాగే కరెస్పాండెంట్ దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. కాలుష్య నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడుకునే విధంగా దీపాల వెలుగుతో పండుగ నిర్వహించుకోవాలన్నారు.



## మదనపల్లె నుండి బెంగళూరుకు అదనపు సర్వీసు లు

### ఆర్టీసీ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి

**మదనపల్లి అక్టోబర్ 18 ప్రభాతవార్త**



మదనపల్లె ప్రయాణికుల సౌకర్యార్థం మదనపల్లి నుండి బెంగళూరుకు అదనపు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా) పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మదనపల్లి నుండి ఎక్కువమంది సాఫ్ట్వేర్ ఉద్యోగులు, అక్కడ స్థిరపడిన వారు, అనేక అవసరాల నిమిత్తం బెంగళూరుకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువయిందన్నారు. దీంతో చాలామంది ప్రైవేట్ బస్సులు, క్యాబులను ఆశ్రయించి ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం రెగ్యులరుగా ఐదు సర్వీసులు నడుస్తున్నాయని వాటికి అదనంగా శని, ఆదివారాల్లో మదనపల్లె నుండి బెంగళూరుకు నాలుగు అదనపు సర్వీసులు, మదనపల్లె టూ వయా బి.కొత్తకోటబెంగళూరుకు ఒక సర్వీసు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక మీదట రద్దీని బట్టి అదనపు సర్వీసులు పెంచుతామని, ఈ సదావకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా సలహాల మేరకు ప్రయాణికుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసీ మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## జి.ఎస్.టి 2.0 సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం


పీలేరులో ఎంవిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీఎస్టీ అవగాహన ర్యాలీ

**పీలేరు అక్టోబర్ 18 ప్రభాతవార్త:**

జి.ఎస్.టి 2.0 సంస్కరణలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి. విజయ్ కుమారి తెలిపారు. మోటార్ వెహికల్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీని శనివారం స్థానిక ఎంబీఐ కార్యాలయం నుండి కోటపల్లి క్రాస్ రోడ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ జి.ఎస్.టి 2.0 అనేది భారతదేశపు వస్తు, సేవల పన్ను వ్యవస్థలో కీలకమైన సంస్కరణల శ్రేణి అన్నారు. ఈ సంస్కరణలు 56వ జి.ఎస్.టి కౌన్సిల్ సమావేశం అనంతరం సెప్టెంబర్ 2025 లో అమల్లోకి వచ్చాయని చెప్పారు. ఈ మార్పులు పన్ను నిర్మాణాన్ని సులభతరం చేయడం, అనేక అవసరమైన, అధిక వినియోగ ఉత్పత్తులపై పన్ను రేట్లను తగ్గించడం, అలాగే సాంకేతికత ఆధారిత అనుసరణా వ్యవస్థలను ప్రవేశపెట్టడం వంటి లక్ష్యాలతో రూపొందించబడ్డాయని తెలియజేశారు. ఇది పేద ప్రజలకు వరం లాంటిదని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జి.ఎస్.టి అధికారి శివయ్య, వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు, డీలర్లు, యువతీ యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం







**మైదుకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరులో "స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కలిసి "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ" చేసి, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలని సంకల్పం చేశారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని, కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించి "వాహన రహిత దినం" పాటించాలని, సాధ్యమైనంత వరకు పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి వాటిని సంపద సృష్టించే ప్రాజెక్టులుగా మలచాలన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో బొటానికల్ గార్డెన్ మరియు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి, ఆర్ఆర్సి కోఆర్డినేటర్ అయ్యవారి రెడ్డి, అధ్యాపకులు నరసింహారావు, సుధీర్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, చిన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ప్రోగ్రాంలో భాగస్వాములు అయ్యారు.

## బాలబాలికల జిల్లా జట్టు ఎంపికలు



**నిమ్మనపల్లి అక్టోబర్ 18 ప్రభాతవార్త**

నిమ్మనపల్లి మండలంలోని మోడల్ స్కూల్ నందు అండర్ 19 కబడ్డీ పోటీలు శనివారం బాలబాలికలకు నిర్వహించారు. ఈ జిల్లా జట్టు ఎంపికకు 30 మండలాల నుండి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. . ఈ కార్యక్రమాన్ని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు మరియు ప్రిన్సిపల్ బి అమృత ప్రియదర్శిని ఎంపీడీవో రమేష్ బాబు అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజా ప్రారంభించారు. అండర్ 19 కార్యదర్శి డాక్టర్ ఎస్ బాబు మాట్లాడుతూ ఎన్నికైన బాలబాలికల చెట్లు త్వరలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ క్రీడాకారులు దేహదారుడు ఎంతో పాటు క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. ఎన్నికైన క్రీడాకారులకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అమృత ప్రియదర్శిని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ బాలరాజు, ఎంఈఓ 2 పద్మావతి, క్రీడాభారతి, పిడిఎస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేష్ బాబు, సెలక్షన్ కమిటీ సభ్యులు శారద మోహన్ అన్సర్ బాషా ఇందిరా మనీ, ఏపీ మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించిన సర్పంచ్

**సిద్ధవటం అక్టోబర్ 18 ప్రభాతవార్త**

గ్రామం పరిశుభ్రంగా పెట్టుకునే బాధ్యత అందరి బాధ్యత అంటూ గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని ముమ్మడిగుంటపల్లె గ్రామంలో శనివారం గ్రామ పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాలకొండయ్య మాట్లాడుతూ పరిశాల పరిశుభ్రత కొరకు ప్రతిరోజు కొంత సమయం కేటాయించి గ్రామాన్ని పరిశుభ్రంగా పెట్టేందుకు శ్రమదానం చేయాలని గ్రామస్తులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించామని కాలుష్య నివారణ కొరకై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పెంచేందుకు తన వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ కృషిచేసి గ్రామాన్ని పచ్చ తోరణంతో పెట్టేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రతి మూడవ శనివారంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా గ్రామాలు పరిశుభ్రంగా పెట్టేందుకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన నిర్వహించడం సంతోషకరమని, అపరిశుభ్రత ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎటువంటి అంటువ్యాధులు సోకకుండా ప్రతి రోజు తొలగింపు చేపడుతున్నామని గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే రాష్ట్రం స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా మారుతుందని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## అందరి జీవితాలు వెలుగుతో నిండాలి.

**కడప, అక్టోబర్ 18, ప్రభాతవార్త**



దీపావళి దివ్వెలు వెలుగులతో అందరి లోగిళ్ళుఎలా ప్రకాశిస్తాయో అలాగే అందరి జీవితాలలో సంతోషాలు విరజిమ్మాలనికందుల గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే చంద్ర ఓబుల్ రెడ్డి ఆకాంక్షించారు. కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని నరకాసుర వధ చేశారు. ప్రిన్సిపాల్ డా. ఎం వి. రత్నమ్మ మాట్లాడుతూ అందరికీ ఎంతో ఇష్టమైన పండుగ దీపావళి అని తెలిపారు. అన్ని శాఖల విభాగాధిపతులు బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థినులు ఎంతో ఆసక్తితో పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

**రాజంపేట, అక్టోబర్18 ప్రభాతవార్త**

రాజంపేట పట్నం జాతీయ రహదారిపై మణికంఠ నగర్లో వేసిన అయ్యప్ప ఆలయంలో ధన త్రయోదశి పురస్కరించుకొని ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ గురు స్వామి దాము ఆచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మూలవిరాటుకు పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులు హరిహరసుతున్ని దర్శనం చేసుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


అయ్యప్పకు హారతి ఇస్తున్న అర్చకులు

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామికి పూజలు

**సుండుపల్లె, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**



సుండుపల్లి మండలం ముడుంపాడు గ్రామం ఎంజీఆర్ కాలనీ ఆరోగ్య పురం లో వెలిసిన శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయము నందు స్వామివారికి అలంకరణ అనంతరం నైవేద్యం సమర్పించడం జరిగినది వచ్చిన భక్తులు తల లీలాలు సమర్పించుకున్నారు భక్తులకి వారి పేర అర్చన చేసి ఆశీర్వాద వచనాలు ఇచ్చి తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరిగిందని ఆలయ అర్చకుడు అమృనాయక్ తెలిపారు.

## బాలికలు అన్ని రంగాలలో రాణించాలి

**చిట్వేలి, అక్టోబర్ 18, ప్రభాతవార్త:**

ప్రతి బాలిక విద్యతోపాటు, అన్ని రంగాలలో ముందంజలో నిలవాలని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఐసిడిఎస్ సూపర్వైజర్ లు వసుంధరమ్మ, సురేఖరాణి ఆధ్వర్యంలో కస్తూరిబా గాంధీ, వెంకటరాజు పల్లి, స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీఐ పాల్గొన్నారు. బాలికల ప్రాముఖ్యత, లింగ వివక్షత అంశాలలో విజేతలుగా నిలిచిన 8,9 తరగతుల పిల్లలకు బహుమతులు అందించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలిక చదువు కేవలం ఆ కుటుంబానికే కాదు, సమాజానికి వెలుగునిస్తుందన్నారు. బాలికలను ప్రోత్సహించి వారి ఉన్నతకి తల్లిదండ్రులు దోహదపడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, రవి, తులసి లు మాట్లాడుతూ ప్రతి బాలిక అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు వసుంధరమ్మ మరియు సురేఖ రాణి మాట్లాడుతూ ప్రతి బాలిక సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ, కల్పనా చావ్లా, పీవీ సింధు, కిరణ్ బేడీ, సావిత్రిబాయి పూలే లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని తమకు ఇష్టమైన రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మురళి, ఉపాధ్యాయులు కళావతి సుహాసిని, శివ నారాయణ, చెన్నయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న సిఐ

## కబడ్డీ పోటీలకు ఆదర్శపాఠశాల విద్యార్థి ఎంపిక

**రామసముద్రం అక్టోబర్ 18 ప్రభాతవార్త**

రామసముద్రం మండలంలోని దిన్ని పల్లె సమీపంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్నపద్మజ జడ్పీ హైస్కూల్ కేసీ పల్లె లో 10 వతరగతి చదువుతున్న శివ మణి అనే విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్, పీడీ ఇందిర, కేసీ పల్లె హెచ్ ఎం వేదవతి పీడీ మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన అండర్ 19 జిల్లా స్థాయి పోటీలో అద్భుతమైన అటతీరుతో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారన్నారు. వీరు రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం తో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్, పాఠశాల చైర్మన్ బాలాజీ, హెచ్ ఎం వేదవతి, పీడీ. మోహన్, ఆదర్శ పాఠశాలఉపాధ్యాయులు నాగరాజ, ఆదర్శ పాఠశాల పీడీ ఇందిర ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు గ్రామ ప్రజలు వీరిని అభినందనలు తెలిపారు.


ఎంపికైన విద్యార్థులు

**ANNAMACHARYA**
Estd. 2001 **PG COLLEGE OF COMPUTER STUDIES :: RAJAMPET**
New Boyanapalli, RAJAMPET, Annamayya Dist. AP – 516126
Approved by AICTE, UGC (2f), & Affiliated to JNTUA, Ananthapuramu
ICET CODE: ANMK Web: www.aitsrajampetpgcs.ac.in

**MBA & MCA - Category-B & SPOT ADMISSIONS - 2025-26**

Eligible candidates for admission into 1st year **MBA & MCA** courses who have not taken admission in any college can attend **Category-B & Spot Admissions** at **10.00 a.m.** on **21.10.2025** at the Institute premises with all original documents for filling-up the vacant seats.

The rule of reservation will be followed for converting the reserved vacancies, if candidates of specific category are not available.

**Note: Students joining under spot admissions will not be eligible for fee reimbursement.**

Ph: 9951892227 / 9010581011 PRINCIPAL